# అభాగీరథీయం

• అనామకుడు

కపిలుని కోపాగ్నికి సగరుడి కొడుకులు భస్మమవుతారు. సగరుడి మనవడైన అంశుమంతుడు కపిలుణ్ణి ప్రార్థిస్తాడు. భస్మమైన ప్రదేశంలో గంగాజలం ప్రవహిస్తే శుభం జరుగుతుందని చెప్తాడు కపిలుడు. ఆ నిమిత్తం ప్రయత్నిస్తారు అంశుమంతుడు, అతడి అనంతరం అతడి కొడుకైన దిలీపుడు. వారి ప్రయత్నాలు ఫలించవు. దిలీపుడి కొడుకు భగీరథుడు ఆ పని చెయ్యాలని సంకల్పిస్తాడు-

హైస్కూల్లో ముప్ఫై యేళ్ళు టీచర్‌గా పని చేసి రిటైరయ్యారు రామమూర్తి గారు.

ఆయనకు తండ్రి నుండి సంక్రమించిన ఆస్తీలేదు, పిల్లలకు ఇచ్చేందుకు ఆయన సంపాదించనూ లేదు.

ఆయన కిద్దరాడ పిల్లల తర్వాత ఒక కొడుకు, ఒక కూతురు.

పెద్ద పిల్లని తన చెల్లెలి కొడుక్కి, రెండవ పిల్లని తన బావమరిదికి ఇచ్చి పెళ్ళి చేశారు. ఆ పెళ్ళిళ్ళకి చేసిన అప్పుల తాలుకు వడ్డీలను కడుతున్నారు. అసలు-అసలు తీరుతుందన్న ఆశలేదాయనకు.

తీరదన్న భయం కొడుక్కుంది. ఆస్తులు రాకపోతే పోయె, తన తండ్రి అప్పులు తనకు రాకపోతే చాలన్నది భాస్కర్ కోరిక.

భాస్కర్ మరీ పెద్దది కాని ఓ కంపెనీలో మరీ చిన్నది కాని ఓ ఉద్యోగం చేస్తున్నాడు.

చెల్లెలి పెళ్ళిని చూసి నిశ్చింతగా పోవాలన్న తండ్రి కోరిక తీరాలంటే రామమూర్తిగారి ప్రావిడెంట్ ఫండ్ డబ్బు చాలా అవసరమని తేలింది భాస్కర్‌కి. అందు కోసం ప్రయత్నం మొదలు పెట్టాడు.

** ** **

భగీరథుడు గంగ కోసం తపస్సు ప్రారంభిస్తాడు-

ప్రావిడెంట్ ఫండ్ డబ్బు రా డానికి ఏం చెయ్యాలో తెలియని భాస్కర్ నలుగురిని కనుక్కుని పని డి.ఇ.ఓ. ఆఫీస్‌లో వుందని అక్కడికెళ్తాడు. అక్కడ అవసరమనిపించిన వాళ్ళందరినీ కలుసుకుని వాళ్ళకి అవసరమయిన వన్నీ ఇస్తాడు. కాగితాలు కదుల్తాయి.

** ** **

గంగ ప్రత్యక్షమవుతుంది. తనని భరించి తన వేగాన్ని ఆపేవాడు కావాలంటుంది. భగీరథుడు శివుడి కోసం తపస్సు చేస్తాడు-

రామమూర్తిగారి డబ్బుకోసం ఎ.జి. ఆఫీస్‌కి వెళ్ళాలని చెప్పడంతో అక్కడ కెళ్తాడు భాస్కర్. అక్కడ చాలా మందిని కలుసుకున్నా, కలుసుకోని వాళ్ళకి కోపం వచ్చి అడ్డంగా రాసిన కాగితాల్ని డి.ఇ.ఓ. ఆఫీస్‌కి తిప్పి పంపేస్తారు.

** ** **

శివుడు ప్రసన్నుడై గంగని భరిస్తానంటాడు.



భగీరథుడు గంగని ఆహ్వానిస్తాడు-

భాస్కర్ డి.ఇ.ఓ. ఆఫీస్‌కి వెళ్ళి మళ్ళీ కావల్సినట్టు రాయించుకుని ఎ.జి. ఆఫీస్‌కి పంపించుకుంటాడు.

** ** **

గంగ శివుడి శిరస్సు మీదకు దూకుతుంది-

ఎ.జి. ఆఫీస్ నుండి చెక్కు డి.ఇ.ఓ. ఆఫీస్‌కి వస్తుంది.

** ** **

వేగంగా దూకుతున్న గంగ అహంకారాన్ని అణచ డానికి శివుడు జటాజూటాన్ని దుర్గంగా మలచి గంగని బంధిస్తాడు.-

ఇంక వచ్చేసిందని ఆనందిస్తున్న భాస్కర్‌కి డి.ఇ.ఓ. ఆఫీస్ వాళ్ళు వెంటనే చెక్కివ్వలేదు.

** ** **

భగీరథుడి ప్రార్థనను మన్నించి శివుడు గంగని వదుల్తాడు.

తమ వాటా తీసుకుని డి.ఇ.ఓ. ఆఫీసు వాళ్ళు చెక్కుని భాస్కర్ కిస్తారు.

** ** **

కొన్ని సంవత్సరాల కష్టాల ఫలితంగా గంగ కావల్సిన ప్రదేశంలో ప్రవహిస్తుంది. భగీరథ ప్రయత్నం సఫలీకృతమవుతుంది-

ఒక సంవత్సరంపైన తిరిగాక భాస్కర్‌కి డబ్బు వస్తుంది. కాని ఈ లోపుగానే తన పెళ్ళి చెయ్యలేక అవస్థ పడుతున్నారని భాస్కర్ చెల్లెలు ఆత్మహత్య చేసుకుంటుంది. అది చూసి బాధతో తండ్రి చచ్చిపోతాడు.

** ** **

(లంచగొండితనం పూర్తిగా ప్రబలిపోయిన ఈ రోజుల్లో ఎంత చిన్నపని అయినా సామాన్యులకు భగీరథ ప్రయత్నంలా అయిపోతోంది. ఆ ప్రయత్నాలకు ఫలితం కూడా దక్కడం లేదు.

ఈ కథలో కొన్ని ఆఫీసుల పేర్లు వచ్చినా, కథ వాళ్ళకి మాత్రమే సంబంధించినది కాదు. తమకి వీలైన చోట పుచ్చుకున్న వాళ్ళకి కూడా లంచం ఇవ్వాల్సిన చోట కథ అభాగీరథీయం కాదా? ఆలోచించండి.)